సాక్షి
కర్నూలు
గురువారం, 8, మే, 2025



ఆకట్టుకున్న బుర్రకథ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళా వేదికపై బుధవారం దక్షయజ్ఞం అనే అంశంపై రాజమండ్రికి చెందిన విభూది లోవరాజు, శ్రీనివాసరాజు, శాంతారామ్ బుర్రకథ నిర్వహించారు.



భవనుడి అక్రమాలు ఎన్నెన్నో!

శ్రీశైలం దేవస్థానం ఇంజినీరింగ్ విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా చేరిన భవన్‌కుమార్ అవినీతి రుచి మరిగి అందినకాడికి దోచుకున్నాడు. 10లో▸



ప్రిపరేషన్ గడువు పెంచాలి

డీఎస్సీ నోటిఫికేషన్ సరిగా లేదని, పలు అంశాల్లో మార్పులు చేపట్టాలని, డీఎస్సీ ప్రిపరేషన్ గడువు పెంచాలని డిమాండ్ చేస్తూ వారు డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అభ్యర్థులు నిరసన తెలిపారు. 10లో▸

న్యూస్‌రీల్

రమణీయం రాయరు రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మంత్రాలయం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో ప్రహ్లాదరాయల రథోత్సవం రమణీయంగా సాగింది. బుధవారం రాత్రి శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో ప్రహ్లాదరాయల పంచ రథోత్సవాలు వైభవంగా జరిగాయి. ముందుగా వెండి అంబారి, చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఉత్సవమూర్తిని కొలువుంచి శ్రీమఠం ప్రాంగణంలో ఊరేగించారు. రథోత్సవాలతో శ్రీమఠం శోభాయమానంగా మారింది.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా కొనియాడారు. బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి పాత్ర ఎనలేనిదన్నారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలన్నారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎస్‌డీసీ చిరంజీవి, టూరిజం అధికారి రామాంజనేయులు, సీపీఓ హిమప్రభాకరరాజు, కలెక్టరేట్ ఏఓ విజయశ్రీ పాల్గొన్నారు.

సహాయ సంక్షేమాధికారి బి.మద్దిలేటికి బెస్ట్ అవార్డు

● ఉత్తమ హెచ్‌డబ్ల్యూఓగా కె.ప్రమీలారాణి



బి.మద్దిలేటి



కె.ప్రమీలారాణి

కర్నూలు(అర్బన్): జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని కర్నూలు సహాయ సంక్షేమాధికారిగా విధులు నిర్వహిస్తున్న బి.మద్దిలేటి స్టేట్ బెస్ట్ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేసిన ఐదుగురు సహాయ సంక్షేమాధికారులకు రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవార్డులను అందించింది. ఇందులో కర్నూలు ఏఎస్‌డబ్ల్యూఓ మద్దిలేటికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయ స్వామి అవార్డును అందించారు. అలాగే ఓర్వకల్ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో వంద శాతం విద్యార్థినీలు ఉత్తీర్ణులయ్యేందుకు కృషి చేసిన వసతి గృహ సంక్షేమాధికారిణి కె.ప్రమీలారాణికి కూడా ఉత్తమ వసతి గృహ సంక్షేమాధికారిగా అవార్డును అందించారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ నవ్య

కర్నూలు(సెంట్రల్): ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జేసీ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 15,501 మంది జనరల్ అభ్యర్థులు, 791 మంది ఒకేషనల్ విద్యార్థులు, మొత్తం 16,292 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. వీరి కోసం 52 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే రెండో సంవత్సరం పరీక్షలకు సంబంధించి మొత్తం 5,082 మంది విద్యార్థులు ఉన్నారని, వీరి కోసం 24 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌ఐఓ గురువయ్య శెట్టి, డీవీఈఓ సురేష్‌బాబు పాల్గొన్నారు.

కమీషన్ల విత్తు

విత్తనోత్పత్తికి మంగళం

- వ్యవసాయ శాఖ ఫామ్‌లు ఉన్నా లేనట్లే
- తంగడంచె ఫామ్‌లో బీళ్లుగా 350 ఎకరాలు
- పత్తి విత్తనాలకు దళారులే ఆధారం
- ఖరీఫ్ సీజన్ వస్తుందంటే దళారులు, అధికారులకు పండగే..
- ముడుపులతో తనిఖీలు నామమాత్రం

తంగడంచె ఫామ్‌లో బీడుగా మారిన భూములు





ప్రాసెస్సింగ్‌కు సిద్ధం చేసిన విత్తన నిల్వలు

➤ 2024-25 సంవత్సరంలో కూటమి ప్రభుత్వం పంపిణీ చేసిన వేరుశనగ నాణ్యతపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఏపీసీడ్స్ సరఫరా చేసిన వేరుశనగలో రాళ్లు, మట్టిపెళ్లలు ఉండటం, విత్తనాలు నాసి రకం, పుచ్చులు ఉండటంతో రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడింది. ఈసారైనా తగిన జాగ్రత్తలు తీసుకుంటారనుకుంటే ఆ ఊసే కరువైంది. ఈ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాల కోసం వ్యవసాయ శాఖ, ఏపీ సీడ్స్ దళారీలపైనే ఆధారపడటం గమనార్హం.

➤ వ్యవసాయ శాఖ, ఏపీ సీడ్స్ విత్తనోత్పత్తి చేసి రైతులకు పంపిణీ చేస్తేనే రైతులకు నాణ్యమైన వేరుశనగ లభిస్తుంది. ప్రభుత్వానికి ఆర్థిక భారం కూడా తగ్గుతుంది. అయితే దళారీలు ఇచ్చే కమీషన్లు పైనుంచి కింది స్థాయి వరకు ఉండటంతో విత్తనోత్పత్తి అటకెక్కినట్లు చర్చ జరుగుతోంది.

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ వస్తుందంటే విత్తన సమస్య రైతులను ముప్పుతిప్పలు పెడుతోంది. విత్తనోత్పత్తికి పేరొందిన ఉమ్మడి కర్నూలు జిల్లా విత్తనాల కోసం దళారీలపై ఆధారపడాల్సి వస్తోంది. రెండు సీజన్లకు అవసరమైన విత్తనాలను ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేస్తోంది. నిబంధనల ప్రకారం రైతులకు ఫౌండేషన్ సీడ్ ఇచ్చి విత్తనోత్పత్తి చేయించాలి. ఆ విత్తనాలను రైతుల నుంచి సేకరించి సర్టిఫైడ్ సీడ్‌గా సరఫరా చేయాలి. అలాంటిది విత్తనాల కోసం ఏపీ సీడ్స్, వ్యవసాయ శాఖ దళారీలపై ఆధారపడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. విత్తనాలను సరఫరా చేసే దళారీలకు ఏపీసీడ్స్, వ్యవసాయ శాఖలు పెట్టుకున్న ముద్దుపేరు 'ఆర్గనైజర్లు'. ఈ ఏడాది కూడా దళారీలు కాసుల పంట పండించుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 10 లక్షల హెక్టార్లలో సాగు భూములు ఉండగా ఉమ్మడి జిల్లాకు పత్తి విత్తన ప్యాకెట్లు 25 లక్షల వరకు.. ఇతర విత్తనాలు 40వేల క్వింటాళ్లు అవసరం.

దళారీలే దిక్కు

విత్తనోత్పత్తికి దేశంలోనే కర్నూలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వేరుశనగ, పత్తి, జొన్న, శనగ, మొక్కజొన్న, కందులు, మినుములు, కొర్రలు తదితర విత్తనాలతో పాటు కూరగాయల విత్తనోత్పత్తి కూడా ఇక్కడ పెద్ద ఎత్తున చేపట్టారు. నేడు కర్నూలు జిల్లాలోనే విత్తనాల కోసం దళారీలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏపీ సీడ్స్, వ్యవసాయ శాఖలు కనీసం తమ ఆధ్వర్యంలోని ఆర్గనైజర్ల(దళారీలు)తో విత్తనోత్పత్తి చేయించి సబ్సిడీపై పంపిణీకి సరఫరా చేయాలి. ఆ దిశగా కూడా చర్యలు శూన్యం.

మామూళ్ల బంధం.. అంతా సవ్యం

2024-25లో సీడ్ విలేజ్ ప్రోగ్రామ్ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం మార్కెట్‌లో వేరుశనగ క్వింటా ధర కేవలం రూ.6,500 నుంచి రూ.7వేలు పలుకుతోంది. రబీలో పండిన వేరుశనగను దళారీలు ఈ ధరతో కొనుగోలు చేసి తూతూ మంత్రంగా ప్రాసెసింగ్ చేసి ఏజెన్సీలకు సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అధికారులు కూడా వీటినే నాణ్యమైన విత్తనమని ధ్రువీకరిస్తూ రైతులకు పంపిణీ చేయనున్నారు. అధికారులు, ఆర్గనైజర్లకు మామూళ్ల బంధం ఉండటంతో అంతా సవ్యమే అన్నట్లు వ్యవహారం సాగుతోంది. దీంతో ఖరీఫ్ రైతులకు నాణ్యమైన విత్తనం ప్రశ్నార్థకమవుతోంది.

తనిఖీలు నామమాత్రమే..

➤ దళారీలు సిద్ధం చేసిన వేరుశనగను వ్యవసాయ శాఖతో పాటు ఏపీ సీడ్స్ అధికారులు తనిఖీ చేయాలి.

➤ అయితే ఈ ప్రక్రియ కాగితాలపై కనిపిస్తుందే తప్ప క్షేత్ర స్థాయిలో జరగని పరిస్థితి.

➤ తనిఖీలకు వెళ్లిన వాళ్లు మామూళ్లు పుచ్చుకొని వస్తున్నట్లు తెలుస్తోంది.

➤ వ్యవసాయ అధికారులు కూడా తూతూ మంత్రంగానే తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం.

➤ ప్రస్తుతం విత్తనాల ప్రాసెసింగ్‌తో పాటు ప్యాకింగ్ జరుగుతోంది.

➤ ఈ నేపథ్యంలో విత్తనాల నాణ్యతను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది.

➤ ఆ దిశగా చర్యలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

మందగించిన విత్తనోత్పత్తి

వ్యవసాయ శాఖకు కర్నూలు జిల్లాలో ఎదురూరు, ఎమ్మిగనూరు మండలం బనవాసి, నంద్యాల జిల్లా తంగడంచె ఫామ్‌లు ఉన్నాయి. ఎదురూరు ఫామ్‌లో 45 ఎకరాలు, బనవాసిలో 55 ఎకరాలు, తంగడంచెలో దాదాపు 600 ఎకరాల భూములు ఉన్నాయి. అయితే ఎదురూరులో తూతూమంత్రంగా ఖరీఫ్‌లో కంది, రబీలో శనగ.. బనవాసి ఫామ్‌లో వరి, తంగడెంచెలో కంది విత్తనోత్పత్తి చేస్తున్నారు. తంగడంచె ఫామ్‌లో 600 ఎకరాల భూములు ఉన్నప్పటికీ 250 ఎకరాల్లోనే విత్తనోత్పత్తి జరుగుతోంది. మిగిలిన 350 ఎకరాల్లో కంపచెట్లు పేరిగి అడవిని తలపిస్తోంది. వందలాది ఎకరాల భూములు వృథాగా మిగిలిపోవడంతో కూటమి ప్రభుత్వం వీటిని ఇతర అవసరాలకు తాకట్టు పెట్టేందుకు ప్రయత్నిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మెగా డీఎస్సీలో క్రాష్‌కోర్సు శిక్షణ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఉచిత మెగా డీఎస్సీ క్రాష్ కోర్సులో శిక్షణను విజయవాడలో నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంధులు, బధిరులు, శారీరక విభిన్న ప్రతిభావంతులైన ఎస్‌జీటీ టీచర్ పోస్టులకు అర్హత ఉన్న అభ్యర్థుల కోసం ఈ శిక్షణను ఏర్పాటు చేశారన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా mdfc.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఈ నెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కనీసం 40 శాతం వికలత్వం ఉన్న వారు మాత్రమే అర్హులని, శిక్షణ కోసం టెట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్‌ఐకి గాయాలు

కర్నూలు: కర్నూలు శివారు డోన్ రోడ్డులో మిస్టర్ ఇడ్లీ సర్కిల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సీఐడీ ఎస్‌ఐ శ్రీనివాసులుతో పాటు ఆయన కూతురికి గాయాలయ్యాయి. బుధవారం ఉదయం ఎస్‌ఐ కుటుంబ సభ్యులతో కలసి నడుచుకుంటూ వెళ్తుండగా దొర్నిపాడు పీఎస్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ కారులో వెళ్తూ ఎస్‌ఐ శ్రీనివాసులును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను తప్పించే క్రమంలో కూతురికి కూడా గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

8 నుంచి ఆర్‌యూ డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 8 నుంచి జూన్ 3వ తేదీ వరకు డిగ్రీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 55 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలను ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్, ఐడీ కార్డుతో పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాలన్నారు.

చేతకాకుంటే వెళ్లిపో!

● ఎంపీడీఓపై ఓ వర్గం టీడీపీ నాయకుల ధ్వజం



ఎంపీడీఓతో వాదిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర: 'అర్హులైన వారికి కాకుండా ఇష్టానుసారంగా బీసీ రుణాలు ఎలా మంజూరు చేస్తారని.. చేతకాకుంటే కార్యాలయం వదిలేసి వెళ్లిపో' అంటూ మాజీ జెడ్పీటీసీ రాజన్నయాదవ్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, రామాంజులు ఎంపీడీఓ కొండయ్యపై ధ్వజమెత్తారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓను కలిసి బీసీ రుణాలకు సంబంధించి టీడీపీకి చెందిన ఒకే వర్గం నాయకుడు చెబితే రుణాలు ఎలా మంజూరు చేశారని ఎంపీడీఓతో వాగ్వాదానికి దిగారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు కాకుండా పనికిరాని నాయకుడు చెప్పిన వారిని మాత్రమే ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. 'ఎంపీడీఓగా నీవు పనికిరావు ఆఫీసు వదిలి వెళ్లిపో' అంటూ తూలనాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 'నా చేతుల్లో ఏమీ లేదు.. ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ చెప్పిన వారికే మంజూరు చేయడం జరిగింది' అంటూ చెప్పారు. ఈ సందర్భంగా విలేకరులు అందరికీ న్యాయం చేయాలని అడిగితే ఎవరైనా సరే ఎమ్మెల్యేని కలిసి రావాలని అప్పుడే రుణాలు మంజూరు చేస్తానని చెప్పడం గమనార్హం.

టీబీ డ్యామ్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌లోని తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. అకాల వర్షాలతో అడపాదడపా జలాశయానికి వరద నీరు చేరుతుంది. ప్రస్తుతం డ్యామ్‌లో 7.5 టీఎంసీల నీరు నిల్వ ఉంటే ఇన్‌ఫ్లో 2,950 క్యూసెక్కులుంది. గత నెల 24న ఇన్‌ఫ్లో జీరో ఉండి 6.871 టీఎంసీల నీరు ఉండగా.. అకాల వర్షాలతో రెండు వారాలుగా వరద నీటి చేరిక మొదలై బుధవారానికి 7.5 టీఎంసీలకు చేరింది. గతేడాది ఇదే సమయానికి 1577.79 అడుగుల వద్ద 3.489 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. వర్షాలు ఆశాజనకంగా కురిస్తే జూలై నెలాఖరుకు డ్యాం పూర్తి మట్టానికి నీరు చేరి ఎల్లెల్సీతో పాటు వివిధ కాల్వకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

యాక్సిస్‌తో చంద్రబాబు చీకటి ఒప్పందం

- కూటమి ప్రభుత్వం అవినీతికి పరాకాష్టి
- నాడు సెకీ ఒప్పందంపై కూటమి నేతల కారుకూతలు
- ఎమ్మెల్యే విరూపాక్షి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

ఆలూరు: కూటమి ప్రభుత్వం అధిక రేట్లకు విద్యుత్‌ను యాక్సిస్ సంస్థతో కమీషన్ల కోసం ఒప్పందం కుదుర్చుకుని అడ్డంగా దొరికిపోయిందని, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబునాయుడుపై ఉందని ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో బుధవారం ఆలూరు మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కె.మల్లికార్జున ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో యూనిట్ విద్యుత్‌కు రూ.2.49 పైసలకే కేంద్ర ప్రభుత్వసంస్థ సెకీతో ఒప్పందం కుదుర్చుకుంటే నాటి టీడీపీ నేతలు అడ్డగోలుగా విద్యుత్‌ను కొనుగోలు చేశారని ఆరోపిస్తూ..అమెరికా అధికారులు ఎప్పుడైనా జగన్ అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నాయని పచ్చమీడియాతో పిచ్చిరాతలుగా రాయించారని మండిపడ్డారు. ప్రస్తుతం యాక్సిస్ సంస్థతో యూనిట్‌కు రూ.4.60 ప్రకారం కొనుగోలు చేయడంలో ఉన్న ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పి నేడు ఎడాపెడా పెంచేస్తున్నారని, ప్రజలు గమనించాలని కోరారు. రాష్ట్ర రాజధాని పేరుతో అక్రమాలకు పాల్పడటం వల్ల రాష్ట్రంలో అభివృద్ధి లోపించిందన్నారు. హొళగుంద నుంచి ధనాపురం గ్రామ బీటీ రోడ్డు పనులను పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే.గిరి, మండల కో-కన్వీనర్ వీరేష్, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు బోయ ఎల్లమ్మ, జీరా నాగమ్మ, మాజీ ఎంపీటీసీలు,భాస్కర్,నాగేంద్ర ఐటీ, స్టూడెంట్ యూనియన్ అధ్యక్షులు వరుణ్, రాజ్, హనుమంతప్ప, యల్లప్ప, వీరేష్, రామన్న, మల్లయ్య, జీరాగౌడు పాల్గొన్నారు.

చెరుకులపాడు, తొగర్చేడులో హైటెన్షన్

● చెరుకులపాడు నారాయణరెడ్డి, సాంబశివుడు హత్యకేసు తుది తీర్పు నేడు

వెల్దుర్తి: మండల పరిధిలోని చెరుకులపాడు, కృష్ణగిరి మండలంలోని తొగర్చేడు గ్రామాలలో హైటెన్షన్ మొదలైంది. 2017 మే 21న పత్తికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామానికి చెందిన చెరుకులపాడు నారాయణరెడ్డి, ఆయన అనుచరుడు సాంబశివుడు దారుణ హత్యకు గురికావడం తెలిసిందే. ఈ జంట హత్యల కేసులో ఇరువర్గాల వాద ప్రతివాదనలు విన్న కర్నూలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి కోర్టు తుది తీర్పును ఈనెల 8వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో గొల్ల మోహన్ ఫిర్యాదు మేరకు, ఆ తర్వాత చేర్చిన ఇరువురితో (ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే, మరొకరు) కలిపి 19 మందిపై కేసు నమోదైంది. ఇరువురి పేర్లు (ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే, మరొకరు) తొలగింపు, ఏ4 చనిపోవడంతో 16 మంది మిగిలారు. వీరిలో చెరుకులపాడు, తొగర్చేడు గ్రామాల వారే అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల్లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి ఎస్‌ఐ అశోక్ గ్రామంలో ప్రజలను సమావేశపరిచి కోర్టు తీర్పు ఎలా ఉన్నా సంయమనం పాటించాలని సూచించారు.

కూలిన ఓవర్ హెడ్ ట్యాంకు

● గతంలో టీడీపీ హయాంలోనే నిర్మాణం

మంత్రాలయం: మండల కేంద్రంలోని రాఘవేంద్రపురంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు కుప్పకూలింది. 2017లో టీడీపీ హయాంలో దాదాపు రూ.25 లక్షలు వెచ్చించి ఈ ట్యాంకును నిర్మించారు. నాణ్యత లేకుండా నిర్మించడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నీటిని నింపలేదు. కూటమి ప్రభుత్వం రావడంతో ఇటీవల ఈ ట్యాంకుకు నీటి సరఫరా మొదలైంది. అయితే నాణ్యత లేకపోవడంతో నీటి బరువుకు ట్యాంకు కుప్పకూలింది. ఆ సమయంలో ట్యాంకు కింద ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బుధవారం వైస్ సర్పంచు హోటల్ పరమేష్, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్ శెట్టి, మల్లికార్జున, వీరారెడ్డి ట్యాంకును పరిశీలించారు. ఏఈ వెంకట్రాముడితో కలిసి శిథిలాల తొలగింపును పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ నాణ్యత లోపంతో ట్యాంకు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై విచారణ చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.



కూలిన ఓహెచ్‌ఆర్ ట్యాంకును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మాక్ డ్రిల్ ప్రారంభంలో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలులో మాక్ డ్రిల్

● యుద్ధం వస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన



ప్రదర్శనగా అగ్నిమాపక, 108 వాహనాలు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహణ కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద చేపట్టారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ రంజిత్ బాషా సూచనల మేరకు 4 గంటలకు కొండారెడ్డి బురుజు పరిసరాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సివిల్, డిఫెన్స్ మాక్ డ్రిల్‌ను అధికారులు నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ ద్వారా జారీ చేసిన ఎస్‌ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) ప్రకారం మాక్ డ్రిల్ కొనసాగింది. మాక్ డ్రిల్‌కు ముందు ప్రజలు భయాందోళనకు గురికాకుండా సమాచారం అందించారు. సైరన్ మ్రోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రదేశంలోకి వెళ్లే విధంగా సూచనలు ఇచ్చి చైతన్యపరిచారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ పొరుగు దేశంలో ఉద్రిక్తత నేపథ్యంలో అత్యవసర పరిస్థితి ఏర్పడే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ ప్రాణాలను కాపాడుకోవడంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలు పాటించాలని సూచించారు. ఓర్వకల్లు ఎయిర్ పోర్టు, డీఆర్డీఓ సంస్థ, ఇండస్ట్రియల్ ఏరియా, మంత్రాలయం, కర్నూలు నగరంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో డిజాస్టర్ మేనేజిమెంట్ ప్రాజెక్టు మేనేజర్ అనుపమ, అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి, కర్నూలు-1, 2 సీఐలు రామయ్య నాయుడు, నాగరాజ రావు, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బాలరాజు, ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



జెండా ఊపీ ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రభుత్వ శాఖలు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది అన్నారు. బుధవారం జిల్లా న్యాయసదన్‌లో న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ సాంబశివరావు, ఐసీడీఎస్ పీడీ నిర్మల, కర్నూలు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, డీసీబీ సెక్రటీ నాగరాజు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదాబేగం తదితరులు కర్నూలు నగరంలో బాల కార్మికులను గుర్తించేందుకు ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీని జిల్లా న్యాయ సేవాసదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కబర్ది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాల కార్మికులను గుర్తించి బడికి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలలతో పనిచేయించడం నేరమని, ఇందుకు రాజ్యాంగంలో అనేక చట్టాలు ఉన్నాయన్నారు. అనంతరం రాజ్‌విహార్, పాతబస్టాండ్, పెద్ద మార్కెట్, ఆనంద్ థియేటర్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి ఐదుగురు బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఒకే రోజు గుడి నిర్మాణం



బేతంచెర్ల వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణ పనుల్లో కూలీలు

బేతంచెర్ల: సాధారణంగా ఒకే రోజు ఆలయ నిర్మాణం పూర్తికాదు. అయితే, మండల పరిధిలోని సీతారామపురం గ్రామంలో ఓ భక్తుడు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాన్ని నిర్మించారు. బుధవారం స్వామి ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించి సాయంత్రం నాలుగు గంటల్లోగా పూర్తి చేశారు. సుమారు 30 మంది కూలీలతో ఈ పనులు చేపట్టారు. నెలరోజుల తర్వాత స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం ఉంటుందని ఆలయ నిర్మాణ దాత బ్రహ్మయ్య తెలిపారు. 13 ఏళ్ల క్రితం ఇదే మాదిరిగా బేతంచెర్ల పట్టణంలో స్వామి మందిరం నిర్మించినట్లు వెల్లడించారు.



పూర్తయిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణం

భవనుడి అక్రమాలు ఎన్నెన్నో!

- ఇంజనీరింగ్ పనుల్లో నాణ్యత మరిచిన ఏఈ భవన్‌కుమార్
- కాంట్రాక్టర్లతో కుమ్మక్కై.. స్లీపింగ్ పార్ట్నర్ అవతారం
- నిబంధనలకు విరుద్ధంగా రక్తసంబంధీకులతో ఏజెన్సీ, దుకాణాల నిర్వహణ
- తాజాగా నాణ్యత లేని ఎయిర్‌పోర్టు కుర్చీల కొనుగోలు.. వేటు వేసిన దేవస్థాన ఈఓ



ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలగలసి వెలసిన పుణ్యక్షేత్రం శ్రీశైలం. అలాంటి చోట ఉద్యోగం అంటే ఎంతో పద్ధతిగా ఉండాలి. అయితే, దేవస్థానం ఇంజినీరింగ్ విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా చేరిన భవన్‌కుమార్ అవినీతి రుచిమరిగాడు. అప్పగించిన పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి కాంట్రాక్టర్లతో వాటా తీసుకోవడం అలవాటు చేసుకున్నాడు. అంతటితో ఆగకుండా నిబంధనలకు విరుద్ధంగా రక్తసంబంధీకులతో దేవస్థానంలో ఏజెన్సీలు, దుకాణాలు నడిపాడు. చివరకు సదరు ఏఈ చేపట్టిన పనుల్లో నాణ్యత లేదని తేలడంతో సస్పెన్షన్ వేటు పడింది. అయితే ఆ ఏఈ గతంలో చేసిన పనుల్లో పలు అవినీతి, అక్రమాలు జరిగాయనే విమర్శలు ఉన్నాయి.



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటు చేసిన నాసిరకం ఎయిర్‌పోర్టు కుర్చీలు (ఫైల్)

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో అభివృద్ధి పనులన్నీ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతుంటాయి. ఈ విభాగంలో రెగ్యులర్ ఇంజినీర్లతో పాటు కొంత మంది కాంట్రాక్ట్ ఇంజినీర్లు పనిచేస్తున్నారు. ఇటీవల సస్పెన్షన్‌కు గురైన భవన్‌కుమార్ 2017లో కాంట్రాక్ట్ పద్ధతిపై ఏఈగా విధుల్లో చేరారు. ఇతను తన మాటతీరు, చాకచక్యంతో ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడంలో దిట్ట. దీంతో వారు సైతం సదరు ఏఈకి ప్రాధాన్యతతో పాటు అధిక పనులు అప్పగించేవారు. మిగిలిన ఏఈలకు చిన్నపాటి మెయింటెనెన్స్ వర్క్‌లు కేటాయించేవారు. రూ.కోట్లు విలువ చేసే వర్క్‌లను భవన్‌కుమారే ఏఈగా వ్యవహరించారు. ఇంతలోనే శ్రీశైలక్షేత్ర మాస్టర్ ప్లాన్ పనులు ప్రారంభం కావడంతో రోడ్డు వర్క్ తనకు కేటాయించేలా ప్రణాళికలు రచించాడు. దాని ప్రకారమే ఉన్నతాధికారులు సైతం ఔటర్‌రింగ్ రోడ్డు వర్క్ కేటాయించారు. అక్కడి నుంచి తన దిశ, దశను మార్చుకున్నాడు.

రూ.22కోట్ల పనులు.. రూ.75కోట్లకు

శ్రీశైల దేవస్థానం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సుమారు ఏడు కిలోమీటర్ల మేర ఔటర్‌రింగ్ రోడ్డు వేయాలని నిర్ణయించి, ఇందుకోసం సుమారు రూ.22 కోట్లతో టెండర్లు పిలిచింది. పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఆ ఏఈ ఆయా పనులను తన తెలివితేటలతో ఎర్త్ వర్క్‌కే ఎక్కువ నిధులు అయిపోయేలా చేసి, రీ ఎస్టిమేట్ వేయించి ఔటర్ రింగ్ రోడ్డు పనులను చివరికి రూ.75 కోట్లతో పూర్తి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు కాంట్రాక్టర్లను బినామీలుగా మార్చుకుని కొన్ని పనులకు వారితో టెండర్లు వేయించి తర్వాత ఆయా పనులు తానే చేస్తాడనే విమర్శలు ఉన్నాయి.

రక్త సంబంధీకులతో ఏజెన్సీ నిర్వహణ

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ ప్రకారం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న వ్యక్తికి సంబంధించిన రక్తసంబంధీకులు టెండర్లు వేయకూడదు, ఏజెన్సీలు నిర్వహించకూడదు, మెటీరియల్, మ్యాన్‌పవర్ సప్లై తదితర దేవస్థానంతో ముడిపడిన ఏ పనులు చేపట్టకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయితే ఈ నిబంధనలకు విరుద్ధంగా సదరు ఏఈ రక్తసంబంధీకులు దేవస్థానంలో స్వామివారి శేషవస్త్రాలు, చీరలు, దుప్పట్లు, కర్టన్స్, ఫర్నీచర్ తదితర పనుల కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. అలాగే శ్రీశైల దేవస్థానం వాణిజ్య సముదాయంలో కూడా దుకాణం ఏర్పాటుచేసి వస్త్రాలను విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది.

ఏఈపై వేటుపడిందిలా

ఇటీవల జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా క్యూకంపార్ట్‌మెంట్లలో భక్తులు సేదదీరేందుకు ప్లాస్టిక్ కుర్చీల స్థానంలో ఎయిర్‌పోర్టు కుర్చీలు ఏర్పాటు చేయాలని ఈఓ ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు సుమారు రూ.40లక్షలతో టెండర్లు పిలిచారు. అయితే, సదరు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై ఏఈ నాణ్యతలేని కుర్చీలను తీసుకువచ్చి ఏర్పాటు చేశారు. పరిపాలనాంశాల్లో భాగంగా దేవస్థాన ఈఓ వాటిని పరిశీలించగా నాణ్యతలేవని తేలడంతో సదరు ఏఈని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. ఈ అంశంలో ఇన్‌చార్జి డీఈకి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ ఘటనతో సదరు ఏఈ అవినీతి బండారం వెలుగులోకి వచ్చింది. సదరు ఏఈ చేపట్టిన పనులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే మరిన్ని అవినీతి అక్రమాలు బట్టబయలవుతాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

పీఠాధిపతికి తులాభారం



తులాభారం తూగుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తులాభారం వేడుక కనుల పండువగా సాగింది. బుధవారం కర్ణాటకలోని మాండ్యకు చెందిన మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ దంపతులు మొక్కుబడిలో భాగంగా బియ్యం, బేడలు, బాదంతో తులాభారం చేపట్టారు. శ్రీమఠం ప్రాంగణంలోని తులాభారం కౌంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

జెడ్పీలో అల్లూరికి ఘన నివాళి



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈఓ, ఇతర అధికారులు

కర్నూలు(అర్బన్): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నిబద్ధత, త్యాగం ఉంటే ఎలాంటి ఆటంకాలనైనా ఎదుర్కోగలమని జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి అన్నారు. బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా స్థానిక జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు అతి చిన్న వయస్సులోనే వీర మరణం పొందారన్నారు. భారత స్వాతంత్ర చరిత్రలో అల్లూరి బ్రిటీష్ వారికి కంటి మీద కునుకు లేకుండా చేశారన్నారు. సమాజం కోసం ప్రాణాలను అర్పించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతను అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ అనురాధ, జెడ్పీలోని వివిధ విభాగాలకు చెందిన పరిపాలనాధికారులు సి. మురళీమోహన్‌రెడ్డి, రాంగోపాల్, జితేంద్ర, సరస్వతమ్మ, పుల్లయ్య, బసవశేఖర్‌తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

బైక్ దొంగను పట్టుకుంటే.. బంగారు నగలు లభ్యం

సి.బెళగల్: స్కూటర్ ఎత్తుకెళ్లిన దొంగను పట్టుకుంటే... బంగారు నగలు లభించిన ఘటన మండల కేంద్రం సి.బెళగల్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. బుధవారం సి.బెళగల్ చెందిన కొందరు యువకులు గ్రామ శివారులోని కంబదహాల్ గ్రామ రోడ్డులో వ్యవసాయ పొలం దగ్గర తమ స్కూటర్లను నిలిపి పొలంలో ఉన్న ఉపరితల ట్యాంక్‌లో స్నానం చేస్తున్నారు. అయితే వారితో పాటు ఓ కొత్త యువకుడు సైతం ట్యాంక్‌లో స్నానం చేశాడు. కొద్ది సేపటికే ట్యాంక్ నుంచి బయటకు వచ్చిన ఆ యువకుడు సి.బెళగల్‌కు చెందిన శివ స్కూటర్‌ను ఎత్తుకెళ్లాడు. అనుమానంతో సదరు యువకుడి కోసం గాలిస్తుండగా కంబదహాల్ సమీపంలో స్కూటర్‌తో కనిపించాడు. వెంటనే ఆ యువకుడిని పట్టుకొని సి.బెళగల్‌లో పోలీసులకు అప్పగించేందుకు వెళ్తుండగా నిందితుడి దగ్గర బంగారు ఆభరణాలున్న ప్యాకెట్ గుర్తించారు. స్కూటర్‌తో పాటు బంగారు దొంగతనం బయటకు వస్తుందని భయపడి కొటారుమిట్ట దగ్గర ఉన్న వంకలోకి దూకాడు. నిందితుడిని వెంబడించిన స్థానికులు వంక నీటి నుంచి బయటకు లాగి పోలీసులకు అప్పగించారు. నిందితుడి దగ్గర దాదాపు ఏడు తులాల బంగారు, వెండి ఆభరణాలున్నాయి. అతడిని విచారిస్తున్నామని ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు.

డీఎస్సీ ప్రిపరేషన్ గడువు పెంచాలి

- సర్కారు తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన అభ్యర్థులు



రోడ్డుపై కూర్చొని నిరసన తెలుపుతున్న డీఎస్సీ అభ్యర్థులు

కర్నూలు సిటీ: డీఎస్సీకి ప్రిపరేషన్ గడువు పెంచాలని, లేకపోతే తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ సరిగా లేదని అందులోని పలు అంశాల్లో మార్పులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వారు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం బిర్లా కాంపౌండ్ దగ్గర రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ మాట్లాడుతూ అనేక ఉద్యమాల ద్వారా డీఎస్సీ నోటిఫికేషన్ సాధించుకున్నామని, అయితే అందులో అనేక అంశాల్లో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. నెల రోజుల పాటు డీఎస్సీ పరీక్షలు జరపరాదని, ఒక జిల్లా ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు 90 రోజుల గడువు ఇవ్వడంతో పాటు వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కోరారు. ఇంటర్మీడియేట్, డిగ్రీ మార్కులు 40 శాతానికి తగ్గించాలన్నారు. ఈ న్యాయమైన డిమాండ్లపై సర్కారు స్పందించకపోతే డీఎస్సీ అభ్యర్థులతో కలిసి చలో విజయవాడ కార్యక్రమ చేపడతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్, కర్నూలు మండల కార్యదర్శి ప్రకాష్, హరికిషన్ రెడ్డి, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చేనేత కార్మికుడు పారిశ్రామికవేత్త కావాలి

కర్నూలు(సెంట్రల్): ప్రతి చేనేత కార్మికుడు ఓ పారిశ్రామిక వేత్త కావాలని చేనేత జౌళి, శాఖ కమిషనర్ రేఖారాణి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో చేనేత కార్మికుల ఐడీ కార్డులు, సొసైటీల ఏర్పాటు తదితర అంశాలపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..చేనేత కార్మికులు సొసైటీలుగా ఏర్పాటై ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 3 సొసైటీలు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయని, అర్హులైన వారితో సొసైటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల్లో ఉండే మహిళలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసి ప్రతిపాదనలు పంపినట్లైతే చేనేత ప్రక్రియలకు ఎన్ఆర్ఎల్ఎం (నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్)కింద నిధులను చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే చేనేత కార్మికులకు స్టడీ టూర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆన్‌లైన్ లో ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న వారికి చేనేత ఐడీ కార్డులు మంజూరు చేస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ..స్వయం సహాయక సంఘాల్లో ఉండే చేనేత మహిళల్లో ప్రతి 30 మందితో ఓ క్లస్టరు ఏర్పాటు చేసి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ, మెప్మా పీడీలను ఆదేశించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ..ఎమ్మిగనూరులో 4 వేలమంది వరకు చేనేత కార్మికులు ఉన్నారని, వారికి ఐడీ కార్డులను ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, హ్యాండ్లూమ్ ఏడీ నాగరాజు, మెప్మా పీడీ నాగశివలీల పాల్గొన్నారు.

ఆదర్శనీయులు దామోదరం సంజీవయ్య

- సంజీవయ్య వర్ధంతి సభలో వక్తలు



సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాల గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య కుల, మతాలకు అతీతంగా బడుగు, బలహీన వర్గాలకు విశేషమైన సేవలు అందించి అందరికి ఆదర్శంగా నిలిచారని మాల గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు కొనియాడారు. సంజీవయ్య 53వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విగ్రహం సమీపంలోనే సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు గోన నాగరాజు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభకు సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు రామకృష్ణ, రత్న ప్రసాద్, శరత్‌బాబు, చైర్మన్ సోమన్న, కన్వీనర్ చంద్రశేఖర్, కోశాధికారి రాజశేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యులు హెచ్‌డీ ఈరన్న, ఎస్సీ, ఎస్టీ, లాయర్స్ ఫోరం అధ్యక్షుడు ఎగ్గోని జయరాజ్, దామోదరం రాధాకృష్ణ హాజరయ్యారు. ముందుగా సభకు అధ్యక్షతన వహించిన గోన నాగరాజు మాట్లాడుతూ రాయలసీమలోని బోయ కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చారని, కోస్తా ప్రాంత కాపు (తెలగ), రాయలసీమ బలిజలను బీసీ జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. మండల్ కమిషన్ కంటే ముందే బీసీలకు రిజర్వేషన్లు అమలు చేశారని, ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలతో పాటు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలయ్యేలా 1961లోనే ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కోర్ కమిటీ సభ్యులు రామకృష్ణ, రత్నప్రసాద్ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా సంజీవయ్య సేవలు అందించారన్నారు. భూమి లేని నిరుపేదల కోసం 6 లక్షల ఎకరాలను పంచారన్నారు. వ్యవసాయానికి కూడా పెద్ద పీట వేసి రాయలసీమలోని కర్నూలు జిల్లాలో హంద్రీ నదిపై గాజులదిన్నె ప్రాజెక్టు, ఆత్మకూరు అటవీ ప్రాంతంలో వరదరాజ స్వామి ప్రాజెక్టు ప్రారంభించారన్నారు. మరో సభ్యులు శరత్‌బాబు మాట్లాడుతూ మాల గెజిటెడ్ ఆఫీసర్స్ గ్రూపుగా ఏర్పడి బ్యాంకుల ద్వారా రుణాలను పొంది పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు బ్యాంకుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి రాజశేఖర్, నాయకులు డా.వై ప్రవీణ్‌కుమార్, ఇరిగేషన్ డీఈఈ ఎస్ ప్రసాదరావు, రిటైర్డు అడిషనల్ ఎస్పీ వేల్పుల జయచంద్ర, మాధవస్వామి, డీఆర్ రాజు, సోగరాజు మునెయ్య, రాజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిషులో మాట్లాడేలా తీర్చిదిద్దాలి



శిక్షణ ఇస్తున్న రామేశ్వర్‌గౌడ్

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ సులభంగా తెలుగు మాట్లాడినట్లు ఇంగ్లిషులో కూడా మాట్లాడగలిగేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని విల్ టు కేన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిషు సంస్థ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ఇంగ్లిషు ఉపాధ్యాయులకు 40 రోజుల ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని డీఈఓ శామ్యూల్‌పాల్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణకు జిల్లాలో దాదాపు 450 మంది ఆంగ్ల ఉపాధ్యాయులు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. వారికి ఇంగ్లిషు బోధనలో పలు మెళకువలు, సూచనలు ఇస్తున్నట్లు చెప్పారు. వాటి ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులను ఇంగ్లిష్‌లో పూర్తి నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందన్నారు. డీఈఓ మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విల్ టు కేన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిషు సంస్థ ప్రతినిధులు వేణుగోపాల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పోలీసులైతేనేం.. మేము ట్యాక్స్‘బాబు’లం!



దేశమంతా యుద్ధ భయం.. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనని అధికార యంత్రాంగం సర్వ సన్నద్ధమవుతోంది. ప్రజలను అప్రమత్తం చేస్తూ, యుద్ధం వస్తే ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో తెలియజేసేందుకు బుధవారం జిల్లా కేంద్రం కర్నూలులో మాక్ డ్రిల్ నిర్వహించారు. రోడ్డు పొడవునా పోలీసు వాహనాలు, ఖాకీ డ్రస్సు వేసుకున్న అధికారులు కలియతిరుగుతున్నారు. ఇలాంటి సమయంలో ఓ మందు బాబు పోలీసులైతేనేమి, ఎవరేమైతే నాకేంటి అన్నట్లు నడి రోడ్డులో మద్యం సేవించడం మొదలుపెట్టాడు. పక్క నుంచే పోలీసు వాహనాలు వెళ్తున్నా.. తాను ట్యాక్స్‘బాబు’ అనే ధీమాతో ఎంచక్కా మందు కలుపుకొని గుటకేసిన దృశ్యాలు కూటమి ప్రభుత్వం తీర్చిదిద్దిన మద్యాంధ్రప్రదేశ్‌కు అద్దం పట్టాయి.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఆటో బోల్తా .. డ్రైవర్ మృతి

బేతంచెర్ల: గూటుపల్లె గ్రామ సమీపాన ఆటో బోల్తాపడిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల మేరకు.. గూటుపల్లె గ్రామానికి చెందిన రామచంద్రుడు (42)ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం హుసేనాపురం సమీపాన భవన నిర్మాణానికి సెంట్రింగ్ చెక్కల బాడుగ ఉండటంతో వెళ్లి వస్తున్నాడు. గూటుపల్లె సుంకులమ్మ గుడి సమీపాన ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె ఉదయ లక్ష్మి ఉన్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో 11 మంది టాపర్లు

కర్నూలు(అర్బన్): బీఆర్ అంబేడ్కర్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో టెన్త్, ఇంటర్ చదివిన విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా 53 మంది టాపర్లుగా నిలువగా, వీరిలో ఉమ్మడి జిల్లా నుంచి 11 మంది ఉండడం గర్వకారణమని సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి తెలిపారు. టాపర్లుగా నిలిచిన వీరికి విజయవాడలో రాష్ట్ర మంత్రి డోలా వీరాంజనేయస్వామి నగదు, బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారని ఆమె బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టాపర్లుగా నిలిచేందుకు మార్గనిర్దేశనం చేసిన టీచర్లు, వార్డెన్లు, ప్రిన్సిపాళ్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. చిన్నటేకూరు ఐఐటీ మెడికల్ అకాడమీకి చెందిన కార్తీక్‌రెడ్డి ఇంటర్‌లో 980 మార్కులతో రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచారని, ఈ విద్యార్థి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించగా, ఐఐటీలో ప్రవేశానికి కృషి చేస్తున్నాడని తెలిపారు. ఇంటర్‌లో 2వ స్థానం, ఎస్ఎస్‌సీలో 8వ స్థానం సాధించి ఉమ్మడి జిల్లాకు చెందిన తమ విద్యార్థులు రాష్ట్ర వ్యాప్త విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు.

టెన్త్ టాపర్లు:
ఎం.కీర్తన(ఆళ్లగడ్డ ఆర్‌పీఆర్‌పీ, 590)
ఎం.ప్రమీల(దిన్నెదేవరపాడు, 587)
బి.దివ్య(వెల్దుర్తి, 584)
ఎం.కీర్తన(ఆళ్లగడ్డ ఆర్‌పీఆర్‌పీ, 585)
ఎల్.ప్రియాంక(ఆళ్లగడ్డ ఆర్‌పీఆర్‌పీ, 578)
కె.సుధ(ఆళ్లగడ్డ ఆర్‌పీఆర్‌పీ, 578)

ఇంటర్మీడియట్ టాపర్లు:
బి.మల్లిక(పత్తికొండ, 983)
కె.ఆనందజ్యోతి(లక్ష్మాపురం, 983)
కె.వెన్నెల(ఆదోని, 980)
జి.అంకిత(వెల్దుర్తి, 980)
ఎం.నాగకార్తీక్‌రెడ్డి(చిన్నటేకూరు, 980)